


నదిలో పార్కు!
ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలోని చిత్రావతి నదిలో అధికారులు పార్కు ఏర్పాటు చేస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది.
8లో



టమాట కిలో రూ.17
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
32.5°/20.9°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలలో కూడా కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, తమ ఫిర్యాదుల సమాచారం తెలుసుకోవడానికైనా ‘మీ కోసం’ కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేయాలని సూచించారు.

పోలీస్ కార్యాలయంలో....
పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ నిర్వహించనున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అర్జీల ద్వారా తెలుపుకోవాలని సూచించారు. అర్జీతో పాటు ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని తెలిపారు.

తోపుదుర్తి భాస్కరరెడ్డికి కన్నీటి వీడ్కోలు



అంతిమయాత్రలో పాల్గొన్న అనంత, ఉష శ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కరరెడ్డి (70) అంత్యక్రియలు ఆదివారం అశ్రునయనాల మధ్య జరిగాయి. శుక్రవారం గుండెపోటుతో ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలు ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలోని సొంత వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. అనంతపురంలోని తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి నివాసం నుంచి పెద్ద ఎత్తున అంతిమయాత్ర సాగింది. భాస్కర్‌రెడ్డి అంతిమయాత్ర విషయం తెలుసుకున్న ప్రజలు కక్కపల్లి కాలనీ నుంచి ఆలమూరు రోడ్డు, బి. యాలేరు, మదిగుబ్బ క్రాస్, సనప, రంగంపేట, తోపుదుర్తి గ్రామాల వరకూ ప్రతి గ్రామం నుంచి వందల సంఖ్యలో తరలి వచ్చారు.

అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు
తోపుదుర్తి భాస్కరరెడ్డి అంత్య క్రియల్లో వైఎస్సార్‌సీపీ ఉభయ జిల్లాల అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, ఉష శ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి రాజశేఖరరెడ్డి, తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి నయనతారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి మార్గంతో పరిపూర్ణత



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సంగారెడ్డి భక్తులు

ప్రశాంతి నిలయం: మనిషిలోని అరిషడ్వర్గాలను వదిలి సత్యసాయి సనాతన ధర్మాలను పాటించడం ద్వారా మనిషి పరిపూర్ణుడు అవుతాడన్న సందేశాన్నిస్తూ సత్యసాయి యూత్, బాలవికాస్ విద్యార్థులు నిర్వహించిన సంగీత నృత్యరూపకం భక్తులను అలరించింది. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సంగారెడ్డి భక్తులు ఆదివారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత స్వర నీరాజనం అర్పించారు. సాయంత్రం ‘మృత్యోర్మా అమృతంగమయ’ పేరుతో నిర్వహించిన సంగీత నృత్యరూపకం ఆకట్టుకుంది. మానవుడు ధర్మ మార్గాన్ని వదిలి అరిషడ్వర్గాలకు లోనై చెడుమార్గాలలో పయనిస్తున్నాడని, సత్యసాయి సనాతన ధర్మాలను పాటించడం ద్వారా పరిపూర్ణుడవుతాడన్న సందేశాన్నిచ్చారు.



నృత్యరూపకంలోని ఓ ఘట్టం

ప్రశ్నించే గొంతుకపై కక్ష సాధింపు



అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఒక నాయకుడు ప్రెస్‌మీట్‌లో చెప్పిన అంశాలను ప్రచురిస్తే మీడియాపై కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛపై గౌరవభావం కలిగి ఉండాలి. భయపెట్టి నిజాలను కప్పివేయాలనుకోవడం సరికాదు. ‘సాక్షి’ ఎడిటర్ ధనంజయరెడ్డి, ఇతర పాత్రికేయులపై పెట్టిన కేసులను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

– వైటీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మడకశిర



పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తారా?



పత్రికా స్వేచ్ఛకు, వాక్‌స్వాతంత్ర్యపు హక్కుకు సంకెళ్లు వేస్తారా? కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే దురుద్దేశంతోనే ఇలాంటి నీచ రాజకీయాలకు తెరలేపుతోంది. స్టేట్‌మెంట్ ప్రచురించిన పత్రికపై కేసులు పెట్టడం దారుణం. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి మీడియా. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపి, వారి బాధ్యతను గుర్తు చేసి ప్రజలపక్షాన నిలిచి పోరాడేది మీడియా. అలాంటి మీడియా స్వేచ్ఛను అణచివేయడానికి అక్రమ కేసులు పెట్టడం అన్యాయం. ప్రతిఒక్కరూ ఖండించాలి.

– కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ధర్మవరం

రెచ్చిపోతున్న ఇసుకాసురులు

➤ ముదిగుబ్బ మండల కేంద్రానికి సమీపంలో చిత్రావతి నది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పక్కనే ఉన్న కదిరి పట్టణంలో ఒక ట్రాక్టర్ ఇసుక (4 టన్నులు) రూ.5 వేలు చొప్పున విక్రయిస్తున్నారు. మంత్రి ఇలాకా కావడంతో అడ్డుకునేందుకు అధికారులు జంకుతున్నారు. ఏ వాహనం ఆపితే ఎవరి నుంచి ఫోన్ వస్తుందో.. ఏమో అని భయపడుతున్నారు.

➤ రొద్దం మండలం పెద్దమంతూరు, చెరుకూరులో పెన్నానది నుంచి ఇసుకను కర్ణాటకలోని దొమ్మితిమర్రి మీదుగా పావగడకు అక్రమంగా తరలిస్తున్నారు. అదే విధంగా పెనుకొండ, సోమందేపల్లికి కూడా తీసుకెళ్తున్నారు. రోజుకు సగటున 150 ట్రాక్టర్ల ఇసుక తరలిపోతోంది. రాత్రింబవళ్లు ఇసుక దందా జరుగుతున్నా అడిగే వారు లేరు.

➤ పరిగి మండలం పెన్నా, జయమంగళి నదుల్లో వందల ట్రాక్టర్ల ఇసుక రోజూ తరలిపోతోంది. ట్రాక్టరు ఇసుకను రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. నదుల్లో పెద్ద పెద్ద గోతులు దర్శనం ఇస్తున్నాయి. పరిగి మండలం నుంచి సుమారు 40 – 50 గ్రామాలకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం.



జయమంగళి నదిలోంచి ఇసుకను తవ్వి ట్రాక్టర్‌లోకి లోడింగ్ చేస్తున్న దృశ్యం

- నంబరు ప్లేట్లు లేకుండా అక్రమ రవాణా
- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు, పోలీసులు
- కూటమి నేతలు సిండికేటుగా మారి విచ్చలవిడిగా దందా
- చిత్రావతి, కుముద్వతి, పెన్నా నదుల్లో విపరీతంగా తవ్వకాలు

సాక్షి, పుట్టపర్తి: అధికారాన్ని అడ్డు పెట్టుకుని కూటమి పార్టీలకు చెందిన ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. రాత్రింబవళ్లు ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. పర్యవేక్షణ లేక ఇసుక దందా జిల్లా వ్యాప్తంగా మూడు పూవులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. చిత్రావతి, పెన్నా, కుముద్వతి, జయమంగళి నదుల్లో జేసీబీ యంత్రాలతో యథేచ్ఛగా ఇసుక తోడేస్తూ.. ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా పొరుగు రాష్ట్రం కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్నారు. ఇదంతా కళ్లెదుటే సాగుతున్నా అధికారులు ‘మామూలు’గానే పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.



పెన్నా నదిలో తవ్వకాలతో ఏర్పడిన గోతులు

వర్షాలకు మేటలు
ఇటీవల కురిసిన వర్షాలకు నదుల్లో ఇసుక మేటలు వేసింది. గుంతలన్నీ పూడి.. చదునుగా ఉండటంతో టక్కున ట్రాక్టర్లకు నింపేస్తున్నారు. పుట్టపర్తి, గోరంట్ల, చిలమత్తూరు, పరిగి, రొద్దం, ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో విపరీతంగా ఇసుక దోపిడీ జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళల్లో టిప్పర్లలో కర్ణాటకకు తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్ (18 టన్నులు) ఇసుక కర్ణాటకలో రూ.50 వేల వరకు ధర పలుకుతున్నట్లు సమాచారం.

అనుమతులు లేకున్నా..
జిల్లాలో కేవలం పీసీ రేవు, సీసీ రేవుల వద్ద మాత్రమే ఇసుక రీచ్‌లు ఉన్నాయి. అయితే జిల్లాలో ఉన్న అన్ని నదుల్లోనూ అనధికారికంగా ఇసుక తోడేస్తున్నారు. అధికార పార్టీల నాయకుల కనుసన్నల్లోనే ఇసుక దందా జరుగుతుండటంతో అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అడపాదడపా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు. పోలీసులు, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు.. ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

మంత్రుల ఇలాకాల్లోనే అధికం
జిల్లాలో ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తోన్న పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాల్లోనే ఇసుక దందా ఎక్కువగా సాగుతోంది. ఆయా ప్రాంతాల నుంచి హిందూపురం మీదుగా కర్ణాటకకు తరలిస్తున్నారు. అధికారులు పట్టుకుంటే వెంటనే మంత్రి అనుచరుల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయి.

పుట్టపర్తిలో విచ్చలవిడిగా..

జిల్లా కేంద్రం పుట్టపర్తి పట్టణంలో రాత్రింబవళ్లు ఇసుక దందా సాగుతోంది. చిత్రావతి నదిలో ట్రాక్టర్లు, టిప్పర్లలో నింపి పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసులు వాహనాలను ఆపితే వెంటనే టీడీపీకి చెందిన ఓ మాజీ మంత్రి నుంచి సిఫారసులు వెళ్తాయి. దీంతో అడ్డుకోవడమే మానేశారు.



పుట్టపర్తిలోని ఎనుములపల్లి సర్కిల్‌లో వెళ్తున్న ఇసుక టిప్పర్

కమలపాడులో దొంగల బీభత్సం

- మాజీ ఎంపీపీ ఇంట్లో చోరీ
- ఐదు కిలోల వెండి, బంగారు ఆభరణాలు, నగదు, దస్త్రాల అపహరణ
- అదే గ్రామంలోని మరో ఇంట్లో నగదు, అర కిలో వెండి చోరీ
- గ్రామంలోని శివాలయంలో హుండీలోని కానుకలను ఎత్తుకెళ్లిన దుండగులు



మాజీ ఎంపీపీ ఇంట్లో వార్డురోబ్‌లో వస్తువులు చెల్లాచెదురు చేసిన దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని కమలపాడులో దొంగలు బీభత్సం సృష్టించారు. మాజీ ఎంపీపీ శైలజారాజశేఖరరెడ్డి ఇంటికి తాళం వేసిన విషయాన్ని గుర్తించిన దుండగులు ఆదివారం వేకువజామున లోపలకు చొరబడ్డారు. బీరువాతో పాటు వార్డు రోబ్‌ను తెరిచి అందులోని కీలకమైన డాక్యుమెంట్లు, రూ.10 వేల నగదు, ఐదు కిలోల వెండి, రెండు జతల బంగారు కమ్మలు అపహరించారు. అనంతరం అర్చకుడు దేవేంద్రస్వామి ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.1.5 లక్షల నగదు, అర కిలో వెండి సామగ్రిని అపహరించారు. గ్రామంలోని శివాలయం ఆవరణలో ఉన్న హుండీ తాళాలను బద్దలుగొట్టి అందులోని సుమారు రూ.15 వేలను అపహరించారు. ఉదయం అనంతపురం నుంచి ఇంటికి చేరుకున్న శైలజారాజశేఖరరెడ్డి, అలాగే గుంతకల్లు ఉంచి కమలపాడుకు చేరుకున్న అర్చకుడు దేవేంద్రస్వామి చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ నాగస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంను రంగంలో దించి వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

శాంతిభద్రతలు, మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి

- నూతన ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడి



ఎస్పీ సతీష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు అధికారులు

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతలు, మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తానని నూతన ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. గుంటూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు ఆయన బదిలీపై వచ్చారు. ఆదివారం పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. బ్రాస్‌బ్యాండ్ నడుమ చాంబర్ వద్దకు చేరుకోగా.. పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు ఎస్పీ రత్న నుంచి సతీష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలోని ప్రతి విభాగాన్నీ పరిశీలించారు. అక్కడి నుంచి బయల్దేరి దుర్గమ్మ ఆలయం చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అటు నుంచి మసీదు, చర్చిలకు వెళ్లి ఆయా మత పెద్దలతో కలసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రశాంతి నిలయం వెళ్లి భగవాన్ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

నేరాల నియంత్రణకు కృషి
జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌నూ సందర్శించి, అక్కడి కేసుల వివరాలు తెలుసుకుని నేరాల నియంత్రణకు కృషి చేస్తానని ఎస్పీ సతీష్‌కుమార్ విలేకరుల సమావేశంలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడతానని, ప్రజలు కూడా పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం శక్తి యాప్‌ను విస్తృతం చేస్తామన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.

నూతన ఎస్పీకి శుభాకాంక్షలు
నూతనంగా ఎస్పీ సతీష్‌కుమార్‌ను డీఎస్పీలు విజయకుమార్, నరసింగప్ప, హేమంత్‌కుమార్, శివన్నారాయణస్వామి, ఆదినారాయణ, శ్రీనివాసులు, ఏఓ సుజాత, సూపరింటెండెంట్ సరస్వతి, మల్లికార్జున, ఎస్పీ సీసీ చిరంజీవి, ఆర్ఐ మహేష్‌తోపాటు సీఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సర్వజనాస్పత్రిలో ఆహారం.. ఘోరం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు అందించే ఆహారంలో నాణ్యత లోపించింది. జీజీహెచ్‌లో డైట్ తయారు చేసే గది బూత్ బంగ్లాను తలపిస్తోంది. దీనిపై గతంలోనే ‘సాక్షి’లో వరుస కథనాలు ప్రచురితమైనా పరిస్థితిలో మార్పురాలేదు. సర్వజనాస్పత్రిలో రోజూ 2,500 మంది ఓపీ, 1,100 మంది ఇన్‌పేషంట్లు ఉంటారు. ఇన్‌పేషంట్లలో గైనిక్, లేబర్ వార్డులో జీఎస్ఎస్‌కే మెనూ ప్రకారం, మధుమేహం ఉన్న వారికి మరో రకమైన ఆహారం ఇవ్వాలి. కానీ నూతన కాంట్రాక్టర్ అలాంటి చర్యలు తీసుకోలేదు. ఆదివారం ఉదయం నాణ్యత లేని ఉప్మా, నీళ్ల చట్నీ, పాలు అందించారు. ఇడ్లీ, పొంగల్ ఇస్తారు కదా అని డైట్ అందించే వారిని అడిగితే ఇంట్లోలాగా ఇక్కడ భోజనం పెట్టరు.. ఏమి ఇస్తే అదే తీసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. గైనిక్, లేబర్ వార్డులోని గర్భిణులు, బాలింతలకు కిచిడీ, చట్నీ ఇవ్వాల్సి ఉండగా, ఉప్మాతోనే సరిపెట్టారు. అలాగే మధ్యాహ్నం రాత్రి వేళల్లోనూ మెనూ పాటించలేదని తెల్సింది.



నాణ్యత లేని ఉప్మాను చూపుతున్న మహిళ



సురక్షిత ప్రమాణాలు పాటించకుండానే ఆహారం వడ్డిస్తున్న దృశ్యం

శుభ్రత పాటించని డైట్ సిబ్బంది..
డైట్ సరఫరా చేసే సిబ్బంది శుభ్రత పాటించడం లేదు. చెప్పులు వేసుకొని ఆహారం తీసుకెళ్లే ట్రాలీని తోసుకెళ్తున్నారు. దీంతో పాటు చేతులకు గ్లౌజు, ముఖానికి మాస్క్, తలకు క్యాప్ లేకుండానే ఆహారం సరఫరా చేశారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం పట్టించు కోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తేనే పరిస్థితులు మెరుగుపడతాయని రోగులు అంటున్నారు.

బోధిస్తాం..వేధింపులు పడలేం

‘పాఠాలు చెబుతాం. పాఠశాల నిర్వహణ మాత్రం చూడలేం’ జిల్లాలోని టీచర్లు ముక్తకంఠంతో చెబుతున్న మాట ఇది. ఎందుకంటే కూటమి సర్కార్ కొలువుదీరాక ప్రధానోపాధ్యాయులపై బోధనేతర పనుల ఒత్తిడి పెరిగింది. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, తరగతి గదుల మరమ్మతులు, తల్లిదండ్రుల కమిటీలతో సమన్వయం.. ఇలా ఇతర కార్యక్రమాల నివేదికలు క్షణాల్లో కావాలంటూ ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది. దీంతో చాలా మంది హెచ్‌ఎం బాధ్యతలు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు.

- హెచ్‌ఎం పోస్టు మాకొద్దు బాబూ
- కూటమి సర్కారులో ప్రధానోపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి
- అడిగిన వెంటనే నివేదికలివ్వాలంటూ ఆదేశాలు
- బోధనేతర పనులతో ఉక్కిరి బిక్కిరి
- మానసిక ఒత్తిడితో రోగాల బారిన పడుతున్న వైనం
- ‘టెన్షన్’ పడలేక పదోన్నతులను తిరస్కరిస్తున్న ఉపాధ్యాయులు

కదిరి: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదోన్నతి(ప్రమోషన్) కోరుకుంటాడు. ఇందుకోసం ఎంతో కష్టపడతాడు. పదోన్నతి దక్కగానే సంతోషపడిపోతాడు. జీవితంలో మరో మెట్టు ఎక్కానని గర్వపడతాడు. మిగతా శాఖలతో పోలిస్తే విద్యాశాఖలో ప్రమోషన్ కోసం దశాబ్దాలుగా ఎదురుచూడాల్సి ఉంటుంది. అందుకే ప్రమోషన్ జాబితాలో పేరు కనిపించగానే టీచర్లు సంబరపడతారు. కానీ రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరాక పరిస్థితి మారిపోయింది. ప్రమోషన్ అంటేనే ప్రస్తుతం టీచర్లు భయపడిపోతున్నారు. ఇటీవల స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ)గా ఉన్న కొందరికి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తే అందులో సగం మంది దాకా ‘మాకొద్దు.. బాబు నీ ప్రమోషన్’ అంటూ తిరస్కరించారు. దీన్ని బట్టి కూటమి ప్రభుత్వం వారిని ఎంత ఒత్తిడికి గురి చేస్తోందో అర్థం చేసుకోవచ్చు.

124 మందిలో 52 మంది విముఖత
గత జూన్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 124 మంది స్కూల్ అసిస్టెంట్లకు కూటమి ప్రభుత్వం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించింది. అయితే వారిలో 52 మంది టీచర్లు పదోన్నతులు తీసుకునేందుకు ఇష్టపడలేదు. కొందరైతే హెచ్‌ఎంలుగా బాధ్యతలు తీసుకొని రెండు, మూడు నెలలు పని చేసి తర్వాత ‘హెచ్‌ఎం పోస్టుకు ఓ దండం’ అంటూ మళ్లీ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు వెనక్కు వచ్చేశారు. ఇలా స్కూల్ అసిస్టెంట్ నుంచి రొళ్ల మండలంలోని ఓ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన ఒకరు రెండున్నర నెలలు హెచ్‌ఎంగా పని చేసి తర్వాత రివర్షన్ తీసుకుని కదిరి ప్రాంతానికి స్కూల్ అసిస్టెంట్‌గా వచ్చారు. ఇటీవలే ప్రమోషన్ పొంది సోమందేపల్లి సమీపంలోని ఓ పాఠశాలలో హెచ్‌ఎంగా ఉన్న ఒకరు ‘నాకు హెచ్‌ఎం ప్రమోషన్ వద్దు. రివర్షన్ ఇచ్చి నన్ను మళ్లీ స్కూల్ అసిస్టెంట్‌గా పంపండి సార్ ప్లీజ్..’ అంటూ అధికారులను వేడుకుంటున్నారు. ఈ మేరకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు.



గౌరవం కాదు..భారం
ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడంటే అందరికీ గౌరవమే. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులందరూ హెచ్‌ఎంకు తగిన గౌరవం, మర్యాద ఇస్తారు. అందుకే గతంలో ప్రధానోపాధ్యాయుడిగా ప్రమోషన్ తీసుకునేందుకు ఉత్సాహం చూపేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి లేదు. ప్రమోషన్ అంటేనే టీచర్లు భయపడి పోతున్నారు. ‘కూటమి ప్రభుత్వం విద్యార్థుల చదువుకు సంబంధించినవి కాకుండా రోజూ అనవసరమైన నివేదికలు కోరుతోంది. అది కూడా సమాచారం అడిగిన గంటలోనే పంపాలని ఒత్తిడి పెడుతోంది... అందుకే చాలా మంది హెచ్‌ఎం పోస్టు మాకు వద్దని తప్పుకుంటున్నారు..’ అని జిల్లాలోని ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ‘సాక్షి’కి తెలిపారు. ప్రభుత్వం పెట్టే ఒత్తిడిని భరించలేని ఎందరో ప్రధానోపాధ్యాయులు బీపీ, షుగర్, గుండెకు సంబంధించిన వ్యాధుల బారిన పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మోయలేని పనిభారం



కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధ్యాయులపై భారం పెరిగింది. బోధనపై దృష్టి పెట్టనివ్వడం లేదు. యాప్‌ల ద్వారా సమాచారం నమోదు, శిక్షణా కార్యక్రమాలు, యోగాడే, పేరెంట్–టీచర్స్ మీటింగ్ వంటి కార్యక్రమాలు పెరిగాయి. బోధనేతర పనులే ఎక్కువయ్యాయి. వీటి వల్ల టీచర్లు బాగా ఒత్తిడికి గురవుతూ రోగాల బారిన పడుతున్నారు.

– పీవీ రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌టీఏ

బోధనేతర పనులే ఎక్కువ



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. పీఆర్‌సీ ఊసు లేదు. ఐఆర్ మాటే వినబడటం లేదు. కానీ నిత్యం టీచర్లపై మాత్రం ఒత్తిడి పెంచారు. బోధనేతర పనులు అప్పగిస్తూ మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు. అందువల్లే జిల్లాలో సగం మందికి పైగా హెచ్‌ఎం పదోన్నతులు తిరస్కరించారు.

– జి.హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ

క్లుప్తంగా

మీ సహకారం మరువలేనిది...

- ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఎస్పీ రత్న



ఎస్పీ రత్నను సన్మానిస్తున్న నూతన ఎస్పీ సతీష్‌కుమార్

పుట్టపర్తి టౌన్‌: గత 15 నెలల కాలంలో చేపట్టిన ప్రతి కార్యక్రమానికి తనకు అందించిన సహకారం మరువలేనిదని సిబ్బందిని ఎస్పీ రత్న కొనియాడారు. బదిలీపై వెళ్తున్న రత్నను డీపీఓలో నూతన ఎస్పీ ఎస్‌.సతీష్‌ కుమార్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎస్పీ సతీష్‌కుమార్‌ మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతలు, నేరాల నియంత్రణ, సిబ్బంది సంక్షేమానికి రత్న చేపట్టిన చర్యలను కొనియాడారు. డీఎస్పీలు విజయకుమార్‌, నర్సింగప్ప, శివనారాయణస్వామి, హేమంత్‌కుమార్‌, ఆదినారాయణ, ఏఆర్‌ డీఎస్పీ శ్రీనివాసులు, ఏఓ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

రసాయనిక వ్యర్థాల వాహనం సీజ్‌



పోలీసులు సీజ్‌ చేసిన వాహనంలో ఉన్న రసాయనిక వ్యర్థాల డ్రమ్ములు

హిందూపురం: స్థానిక గోళాపురం పారిశ్రామిక వాడలోని పెయింట్స్‌ పరిశ్రమ నుంచి రసాయనిక వ్యర్థాలను రహస్యంగా శనివారం రాత్రి ఐచర్‌ వాహనంలో తరలించి బహిరంగ ప్రదేశంలో పడేస్తుండగా మాజీ సర్పంచ్‌ నాగార్జున, గ్రామస్తులు గుర్తించి అడ్డుకున్నారు. డ్రమ్ములతో సహా ఐచర్‌ వాహనాన్ని హిందూపురం రూరల్‌ పీఎస్‌కు తరలించి, పోలీసులకు అప్పగించారు. రసాయనిక వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పొలాల వద్ద పడేస్తుండడంతో గోళాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో పచ్చదనం నశిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాన్ని, డ్రమ్ములను సీజ్‌ చేసి, కేసు నమోదు చేయనున్నట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు.

నదిలో పార్కు!



చిత్రావతి నదిలో ఏర్పాటు చేస్తున్న పార్కు

- భవిష్యత్తులో పుట్టపర్తికి పొంచి ఉన్న ముంపు ప్రమాదం
- ప్రజలు వద్దంటున్నా పట్టించుకోని మాజీ మంత్రి, అధికారులు

పుట్టపర్తి అర్బన్‌: స్థానిక చిత్రావతి నదిలో చేపట్టిన పార్కు ఏర్పాటు పనులపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నదిని ఆక్రమించి పార్కును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రముఖ నగల కంపెనీ అందజేసిన రూ.1.20 కోట్లతో నదిలోని 35 సెంట్ల స్థలంలో పార్కు ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. సత్యసాయి శత జయంతి వేడుకల్లోపు పార్కును అందుబాటులోకి తీసుకువచ్చేలా రూపొందించిన ప్రణాళిక మేరకు పనులు చేపట్టారు. సుమారు 90 మీటర్ల పొడవు, 15 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు కానున్న పార్కులో వాటర్‌ ఫౌంటెన్‌, షెల్టర్లు, ఇతరత్రాలను ఏర్పాటు చేయనున్నారు. కాగా, చిత్రావతిలో కాకుండా మరో ప్రాంతంలో పార్కు నిర్మాణం చేపట్టాలని గతంలో కౌన్సిల్‌ సమావేశంలో సభ్యులు తీర్మానించారు. అయినా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఇరిగేషన్‌ అధికారులు పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తుండడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కుంచించుకుపోయిన పరివాహక ప్రాంతం

ఇప్పటికే చిత్రావతి నదిలో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయి. నదికి తూర్పు వైపున పలువురు టీడీపీ నాయకులు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. ఈ ఆక్రమణలు పోను నది విస్తీర్ణం 140 మీటర్లకు కుంచించుకుపోయింది. ఇందులో 15 మీటర్లలో పార్కు ఏర్పాటు చేస్తే కర్ణాటకలోని నంది కొండ నుంచి వచ్చే వరద నదిలో సజావుగా ప్రవహించే అవకాశముండదు. పార్కు ఏర్పాటు చేస్తున్న ప్రాంతానికి ఎగువన చెక్‌డ్యాం ఉంది. చెక్‌డ్యాం నిండిన అనంతరం వచ్చే నీటి ప్రవాహానికి ఈ కట్టడాలు తట్టుకుంటాయా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

చేదు జ్ఞాపకాలు మరువని పట్టణ వాసులు

2021, నవంబర్‌లో చిత్రావతి నదికి ఎన్నడూ లేనంతగా వరద వచ్చింది. దీంతో ఆక్రమణలతో కుంచించుకుపోయిన నది నుంచి వరద పుట్టపర్తిలోని ఎస్సీ కాలనీ, మున్సిపల్‌ కార్యాలయం, 3వ వార్డు, కమ్మవారిపల్లి రోడ్డు, గోవిందపేట, వివేకానంద నగర్‌, గ్రౌండ్‌ ఏరియా తదితర వీధులను ముంచెత్తింది. భవంతుల్లోని మొదటి ఫ్లోర్‌లు మొత్తం నీళ్ల నిలిచాయి. దీంతో కోట్లాది రూపాయలు నష్టపోయారు. ఈ చేదు జ్ఞాపకాలను ప్రస్తుతం పుట్టపర్తి వాసులు గుర్తు చేస్తున్నారు. నదిని ఆక్రమించి పార్కును నిర్మిస్తే భవిష్యత్తులో పుట్టపర్తి ముంపునకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్‌ జగన్‌తోనే కురుబలకు సముచిత స్థానం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్‌, సమన్వయకర్త టీఎన్‌ దీపిక



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్‌ దీపిక (చిత్రంలో) ఉషశ్రీ చరణ్‌

చిలమత్తూరు: రాష్ట్రంలో కురుబలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక వ్యక్తి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్‌, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్‌ దీపిక కొనియాడారు. హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కురుబ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌ఎం శివ ఆధ్వర్యంలో కురుబల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఉషశ్రీచరణ్‌, దీపికతో పాటు పార్టీ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ హాజరై, మాట్లాడారు. కులాలకు అతీతంగా సమానత్వం అనే అనుబంధాన్ని రాష్ట్రానికి పరిచయం చేసిన వ్యక్తి వైఎస్‌ జగన్‌ అని ప్రశంసించారు. జిల్లాలో మంత్రిగా ఉన్న సవితకు సంస్కారం లేదని ఉషశ్రీచరణ్‌ విమర్శించారు. మంత్రి పదవిపై ఉన్న వ్యామోహం కురుబలపై ఆమెకు లేదన్నారు. డీజిల్‌, ఇసుక అక్రమ రవాణాతో పాటు ప్రతి వైన్‌ షాపులోనూ బాటిల్‌పై ట్యాక్స్‌ వసూళ్లకు తెరలేపిన సవిత మంత్రి పదవికి అనర్హురాలన్నారు. వైఎస్సార్‌సీపీలో కొనసాగుతున్నాడన్న అక్కసుతోనే రాప్తాడు నియోజకవర్గంలో కురుబ లింగమయ్యను హత్య చేశారన్నారు. కురుబలు అన్ని రంగాల్లో రాణించాలంటే అది ఒక్క వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందన్నారు. కురుబలను విద్యావంతులను చేయడమే లక్ష్యంగా చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. రాష్ట్ర కురుబ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌ఎం శివ, పార్టీ నేత వేణురెడ్డి, వైఎస్‌ఎంపీపీ రామాంజనేయులు, చౌళూరు ఎంపీటీసీ కృష్ణవేణి, మాజీ ఎంపీటీసీలు మల్లేష్‌, మల్లన్న, పార్టీ నేతలు మహేష్‌గౌడ్‌, రామదాసు, రామకృష్ణ, మారుతి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ఇన్విటేషన్‌ ఫుట్‌బాల్‌ టోర్నీ

గుత్తి: స్థానిక ఆర్‌ఎస్‌లోని రైల్వే ఇనిస్టిట్యూట్‌ క్రీడా మైదానంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకూ ఇన్విటేషన్‌ ఫుట్‌బాల్‌ టోర్నీని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి గుత్తి రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం నిర్వాహకులు సమావేశమై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గౌతమపురి ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌, ఆర్డీటీ, రైల్వే ఇనిస్టిట్యూట్‌ సంయుక్తంగా ప్రేమ్‌ అండ్‌ సూరి మెమోరియల్‌ ఇన్విటేషన్‌ ఫుట్‌బాల్‌ టోర్నీని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల జట్లను ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నారు. విజేత జట్లను నగదు పురస్కారాలతో సత్కరించనున్నామన్నారు. టోర్నీలో పాల్గొన దలచిన జట్లు ఈ నెల 18లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 90526 53405, 99856 78208, 99665 60163లో సంప్రదించాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఓడీ చెరువు వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో తండ్రి మృతి చెందగా... కుమారుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. చిలమత్తూరు వద్ద ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా... విషమ పరిస్థితిలో మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



శ్రీనివాసులు (ఫైల్‌)

చిలమత్తూరు: మండల కేంద్రానికి చెందిన శ్రీనివాసులు (38) శనివారం రాత్రి దిగువ బస్టాండ్‌ నుంచి ద్విచక్ర వాహనంపై బీసీ కాలనీ వైపుగా వెళుతుండగా తుమ్మలకుంటకు చెందిన నవీన్‌, హరీష్‌ బుల్లెట్‌ వాహనంపై ఎదురుగా వస్తూ ఢీకొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు, నవీన్‌, హరీష్‌ను స్థానికులు 108 అంబులెన్స్‌ ద్వారా తొలుత స్థానిక పీహెచ్‌సీకి అక్కడి నుంచి కర్ణాటకలోని బాగేపల్లిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్గమధ్యంలో శ్రీనివాసులు మృతి చెందాడు. నవీన్‌, హరీష్‌ను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై ఎస్‌ఐ మునీర్‌ అహమ్మద్‌ కేసు నమోదు చేశారు.

ఓడీచెరువు: కదిరికి చెందిన బూదిలి అల్లాబకాష్‌ (50) బీడీల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం తన చిన్న కుమారుడు రియాజ్‌తో కలసి వ్యాపార నిమిత్తం ఓడీచెరువుకు ద్విచక్రవాహనంపై వస్తుండగా స్థానిక వెంకటసాయి ఐటీఐ సమీపంలో జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వెంటనే అప్రమత్తమై 108 అంబులెన్స్‌ ద్వారా ఓడీ చెరువులోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా అల్లాబకాష్‌ మృతి చెందాడు. రియాజ్‌కు ప్రథమచికిత్స అనంతరం కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఓడీ చెరువు పీఎస్‌ ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేశారు.

కబడ్డీ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన బాలికల జట్టుతో నిర్వాహకులు

కదిరి అర్బన్‌: ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ విజయవాడలో జరిగే జూనియర్‌ బాలబాలికల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్లను ఆదివారం కదిరిలోని జెడ్పీహెచ్‌ఎస్‌ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా శరత్‌కుమార్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్‌ సభ్యులు వెంకటరమణ, సుహాసిని, హరీష్‌కుమార్‌ హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 100 మంది క్రీడాకారులు హాజరుకాగా వీరిలో ప్రతిభ చూపిన బాలికల విభాగంలో 14 మందిని, బాలురు విభాగంలో 14 మందిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు.

అల్లుడితో వివాహేతర సంబంధమే కారణం

- వివాహిత హత్య కేసులో వీడిన మిస్టరీ
- రెండు నెలల క్రితం భార్యను చంపి పాతిపెట్టిన భర్త, బంధువులు
- నిందితుల్లో ముగ్గురి అరెస్ట్‌
- అజ్ఞాతంలో మరో నలుగురు



నిందితులను అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

ధర్మవరం అర్బన్‌: అల్లుడితో వివాహేతర సంబంధం కారణంగానే బంధువులతో కలసి భార్యను భర్త హతమార్చి గుట్టు చప్పుడు కాకుండా పాతిపెట్టాడు. రెండు నెలల క్రితం చోటు చేసుకున్న ఈ ఘటనలోని మిస్టరీని పోలీసులు ఛేదించి, నిందితులను అరెస్ట్‌ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను ఆదివారం ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప వెల్లడించారు. ధర్మవరంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న సాకే వెంకట్రాముడు భార్య సాకే సరస్వతి (34) అల్లుడితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుంది. విషయం తెలుసుకున్న భర్త పలు మార్లు భార్యను హెచ్చరించినా ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో ఈ ఏడాది జూలై 12న సాయంత్రం సాకే వెంకట్రాముడు తన అక్క చిట్టెమ్మ, ఆమె భర్త రామాంజి, మరో అక్క వెంకటలక్ష్మి, వదిన రామాంజినమ్మ సాయంతో సరస్వతిని హత్య చేశాడు. అనంతరం మహాత్మాగాంధీకాలనీకి చెందిన సాకే నరసింహులు, చెన్నకేశవపురానికి చెందిన గుజ్జల విజయ్‌కుమార్‌ సాయంతో మృతదేహాన్ని ఆటోలో గొల్లవాండ్లపల్లి వద్దకు చేర్చి వంకలో పాతిపెట్టారు. కాగా, సరస్వతి కనిపించడం లేదంటూ ఈ నెల 12న అందిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్‌ కేసు నమోదు చేసి, లోతైన దర్యాప్తు చేపట్టడంతో హత్య విషయం వెలుగు చూసింది. ఈ కేసులో భర్త సాకే వెంకట్రాముడు (ఏ1), సాకే నరసింహులు (ఏ6), గుజ్జల విజయ్‌కుమార్‌ (ఏ7)ను ఆదివారం అరెస్ట్‌ చేసి, ఓ ఆటో, మోటార్‌ సైకిల్‌, సెల్‌ఫోన్లను సీజ్‌ చేశారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు. అజ్ఞాతంలో ఉన్న మరో నలుగురు నిందితులను త్వరలో అరెస్ట్‌ చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బాల్‌ బ్యాడ్మింటన్‌ టోర్నీ విజేత తూ.గో., గుంటూరు



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన తూర్పు గోదావరి జట్టు



బాలికల విభాగంలో విజేతగా నిలిచిన గుంటూరు జట్టు

- ముగిసిన రాష్ట్రస్థాయి బాల్‌ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌ షిప్‌ పోటీలు

బత్తలపల్లి: మండలంలోని రామాపురం జెడ్పీహెచ్‌ఎస్‌ మైదానం వేదికగా మూడు రోజులుగా సాగుతున్న రాష్ట్ర స్థాయి జూనియర్‌ బాలబాలికల 10వ బాల్‌బ్యాడ్మింటన్‌ చాంపియన్‌ షిప్‌ టోర్నీ ఆదివారం ముగిసింది. అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్‌ బాల్‌ బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ టోర్నీ చాంపియన్‌ షిప్‌ను బాలుర విభాగంలో తూర్పు గోదావరి జిల్లా, బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్లు దక్కించుకున్నాయి. కాగా, ఆదివారం నిర్వహించిన ఫైనల్‌ మ్యాచ్‌లో హోరాహోరీగా సాగాయి. బాలుర విభాగంలో రెండో స్థానంలో చిత్తూరు, మూడో స్థానంలో శ్రీకాకుళం, నాల్గో స్థానంలో ప్రకాశం జిల్లా జట్లు నిలిచాయి. అలాగే బాలికల విభాగంలో రెండో స్థానంలో విశాఖపట్నం, మూడో స్థానంలో తూర్పుగోదావరి, నాల్గో స్థానంలో శ్రీకాకుళం జట్లు నిలిచాయి. విజేతలకు ట్రోఫీలను ముఖ్యఅతిథులు అందించి, అభినందించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కోలాటంతో స్థానిక కళాకారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఫిజికల్‌ డైరెక్టర్‌ తలారి లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు, రాష్ట్రబాల్‌ బ్యాడ్మింటన్‌ అధ్యక్షుడు విజయశంకర్‌రెడ్డి, చైర్మన్‌ వెంకట్రావు, జనరల్‌ సెక్రటరీ బాలాజీ, జిల్లా బాల్‌ బ్యాడ్మింటన్‌ అధ్యక్షుడు ఈశ్వరయ్య, జనరల్‌ సెక్రటరీ వెంకటేష్‌, నాయకులు ధర్మవరం మార్కెట్‌ యార్డు వైస్‌ చైర్మన్‌ అయ్యప్పనాయుడు, చిలకం మధుసూదన్‌ రెడ్డి, నారాయణరెడ్డి, ఆకులేటి వీరనారప్ప, పురంశెట్టి రవి, గ్రామ పెద్దలు, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

లేపాక్షిని సందర్శించిన కర్ణాటక హైకోర్టు సీనియర్‌ న్యాయమూర్తి



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న న్యాయమూర్తి దినేష్‌కుమార్‌సింగ్‌

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి ఆలయాన్ని కర్ణాటక హైకోర్టు సీనియర్‌ న్యాయమూర్తి జస్టిస్‌ దినేష్‌కుమార్‌సింగ్‌ ఆదివారం ఉదయం సందర్శించారు. తహసీల్దార్‌ సౌజన్యలక్ష్మి, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి స్వాగతం పలికారు. వీరభద్రస్వామి, దుర్గాదేవికి ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అర్చకులు అందజేశారు. ఆలయ విశిష్టతను అర్చకులను అడిగి తెలుసుకున్నారు.

దాడి ఘటనలో వ్యక్తి మృతి

పావగడ: దాడి ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పావగడ తాలూకా అరసికెరె పీఎస్‌ పరిధిలోని బెళ్లిబట్లు గ్రామానికి చెందిన వాల్మీకి రెండు రోజుల క్రితం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రోడ్డు పక్కన ఆడుకుంటున్న చిన్నారి బాలాజీ ఒక్కసారిగా ద్విచక్ర వాహనానికి అడ్డుగా వెళ్లాడు. ఆ సమయంలో వాల్మీకి చాకచక్యంతో వ్యవహరించడంతో బాలుడికి ప్రాణాపాయం తప్పింది. అయితే అసహనానికి గురైన వాల్మీకి.. అక్కడే ఉన్న బాలుడి తాత దళిత హనుమంతరాయప్ప (60)పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రమాదం జరిగి ఉంటే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తూ అక్కడే ఉన్న కర్రతో దాడి చేశాడు. ఘటనలో నడుముకు బలమైన దెబ్బ తగలడంతో హనుమంతరాయుడు ఇంటి వద్దనే చికిత్స పొందుతూ రెండు రోజుల తర్వాత మృతి చెందాడు. మృతుడి కుమార్తె రూప ఫిర్యాదు మేరకు వాల్మీకిపై కేసు నమోదు చేసినట్లు అరసికెరె గ్రామీణ సీఐ గిరీష్‌ ఆదివారం తెలిపారు.

'పార్ట్‌ టైం' పదాన్ని తొలగించాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్‌ విజయ్‌

అనంతపురం ఎడ్యుకేషన్‌: సమగ్ర శిక్షలో ఆర్ట్‌, క్రాఫ్ట్‌, పీఈటీ, మ్యూజిక్‌ టీచర్లు 14 సంవత్సరాలుగా పార్ట్‌టైం ఉద్యోగులుగా చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నారని, వీరికి పార్ట్‌టైమ్‌ అనే పదాన్ని తొలగించి స్పష్టమైన జాబ్‌చార్ట్‌తో మినిమం టైం స్కేల్‌ అమలు చేయాలని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్‌ కె.విజయ్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం స్థానిక పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల సంఘం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న ఆగస్టు నెల వేతనం వెంటనే చెల్లించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్‌ లీవులు ఇవ్వాలని, డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్‌.దివాకర్‌ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సభ్యులు పి.చంద్రకళ, నరేంద్ర, మధుబాబు, చౌడప్ప, గీత, జంబునాథ్‌, రంగనాథ్‌, టి.నరసింహులు, కల్పన, గౌతమి, దీప, శ్రీదేవి, కళావతి, రాజేష్‌, రాంప్రసాద్‌, సుమలత పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం

- 2006-07 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థులు



మారాల ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పుట్టపర్తి: తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో పాలు పంచుకుంటామని బుక్కపట్నం మండలం మారాల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. పాఠశాలలో 2006-07 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. 18 ఏళ్ల విరామం తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాటి గురువులు ముజఫర్‌ హుస్సేన్‌, లలితాదేవి, మహాలక్ష్మి, మోహన్‌బాబుతో పాటు ప్రస్తుత హెచ్‌ఎం నరేంద్రను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలలో వంట శాల నిర్మాణానికి రూ.65 వేలు అందజేసి, పనులకు శ్రీకారం చుట్టారు.

పశువులకు రక్ష.. గాలికుంటు టీకా

- జిల్లాలో 3.35 లక్షల పశువులకు ఉచితంగా టీకా పంపిణీ
- నేటి నుంచి అక్టోబర్‌ 15 వరకూ వైద్య శిబిరాల నిర్వహణ



పుట్టపర్తి అర్బన్‌: పశువులకు సోకే ప్రధాన వ్యాధుల్లో గాలికుంటు ఒకటి. సకాలంలో వ్యాధి లక్షణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టకపోతే పశువులు, వాటి పాలు తాగిన దూడలు మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో గాలికుంటు నివారణ టీకాల పంపిణీకి పశు సంవర్ధక శాఖ సిద్ధమైంది. ఈ నెల 15 నుంచి అక్టోబర్‌ 15వ తేదీ వరకూ జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో టీకాలు వేసేలా చర్యలు తీసుకుంది. జిల్లాలో పాడి పశువులు 2.45 లక్షలు, గేదెలు 90 వేలు, గొర్రెలు 26 లక్షలు, మేకలు 4.5 లక్షలు ఉన్నాయి. అలాగే పశు వైద్యశాలలు 66, గ్రామీణ పశు వైద్యశాలలు 23, అంబులెన్సులు 13, వెటర్నరీ వైద్యులు 33 మంది ఉన్నారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

గాలికుంటు వ్యాధి పికోర్నా విరిడే వైరస్‌ ద్వారా సంక్రమిస్తుందని పశు వైద్య నిపుణులు అంటున్నారు. పశువులు కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. పశువులు అలాంటి ఆహారం, నీరు తీసుకోకుండా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. గాలి కుంటు సోకిన పశువుల శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల నుంచి 106 డిగ్రీల వరకు ఉంటుంది. నోరు, నాలుక, పెదవులు, చిగుళ్లు, కాలి గిట్టల వద్ద బొబ్బలు వస్తాయి. 24 గంటల తర్వాత అవి పగిలి పుండ్లుగా మారుతాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు నోటిలో పుండ్ల నొప్పి కారణంగా మేత తినవు. దీంతో నీరసించిపోతాయి. నోటి నుంచి లాలాజలం కారుతుంటుంది. కాలి గిట్టల్లో ఉన్న పుండ్ల వల్ల సరిగ్గా నడవలేవు. వ్యాధి సోకిన తరువాత పాలు ఇవ్వడం తగ్గుతుంది. లేత వయస్సు గల పశువులకు వ్యాధి సోకితే మరణించే ప్రమాదం ఎక్కువగా ఉంది. కొన్ని పశువుల్లో బొబ్బలు పొదుగుపైన ఏర్పడితే పొదుగు వాపునకు దారి తీస్తుంది. వ్యాధి బారిన పడిన పశువు నుంచి మరో పశువుకు వ్యాప్తి చెందే అవకాశముంది.

ప్రథమ చికిత్స ఇలా..

పశువుల నోరు, కాలి గిట్టల మధ్య ఏర్పడిన పుండ్లను పొటాషియం పర్మాంగనేట్‌ ద్రావకంతో శుభ్రంగా కడుగాలి. తరువాత బోరోగ్లిజరిన్‌ పేస్ట్‌ను పుండ్లపై రాయాలి. పెన్సిలిన్‌ వంటి యాంటిబయోటిక్‌ మందులను వైద్యుల సూచన మేరకు పశువులకు అందించాలి. నోటిలో పుండ్ల కారణంగా ఆహారం సరిగా తినలేని పశువులకు జావ, జొన్న అన్నం, ఉప్పు, బెల్లంతో కలిపి రోజూ తాగించాలి.

నివారణ చర్యలే ముఖ్యం



పశువుల్లో గాలి కుంటు వ్యాధి సోకిన తర్వాత కంటే ముందుగానే నివారణ చర్యలు తీసుకోవడం ముఖ్యం. నాలుగు నెలల వయస్సు నిండిన పశువులు, జీవాలకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించాలి. వ్యాధి సోకిన పాడి పశువుల దూడలకు తాగించకూడదు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సోమవారం నుంచి జిల్లాలో ప్రారంభిస్తున్నాం. ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్‌ శుభదాస్‌, జిల్లా పశువైద్యాధికారి